క్లుప్తంగా

ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రతినిధిగా మక్కయ్య



రుద్రూర్: పొతంగల్ మండలం హంగర్గా గ్రామానికి చెందిన శ్రీగంధం మక్కయ్య బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియామకమయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో నాయకులు సందనం దివాకర్, స్వామి యాదవ్, నాగం సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



ఆర్మూర్‌టౌన్: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా స్వీప్ కార్యక్రమంలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఓటు హక్కు కల్గిన వారు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ భూమేష్, మెప్మా టీఎంసీ ఉదయ్‌శ్రీ, సీవో రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనం ప్రారంభం



బోధన్: పట్టణ కేంద్రంలోని రాకాసీపేట్‌లో నూతనంగా నిర్మించిన మున్నూరు కాపు సంఘం భవనాన్ని సంఘ ప్రతినిధులు శుక్రవారం ప్రారంభించారు. గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే షకీల్ మంజూరు చేసిన రూ.5 లక్షల నిధులతో పాటు తమ 67 కుటుంబాల సంఘ సభ్యుల విరాళాలతో భవన నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు యేశాల రవి, చిన్న పోశెట్టి, ప్రతినిధులు ఎర్రం పెద్ద లక్ష్మణ్, మాజీ ఎంపీపీ గంగాశంకర్, సీపీఎం అసెంబ్లీ నియోజక వర్గ కార్యదర్శి యేశాల గంగాధర్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



బోధన్‌రూరల్: మండలంలోని రాజీవ్‌నగర్ తండాలో గిరిజనుల ఆరాధ్యదైవం రామారావు మహరాజ్ ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు శుక్రవారం భూమిపూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాందేవ్, కార్యదర్శి రవిదాస్, గ్రామపెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్లు అందజేత



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉన్న కింగ్స్ యూత్, శ్రీ విజ్ఞా యూత్ సభ్యులకు క్రికెట్ కిట్‌లను మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యశ్రీనివాస్, కౌన్సిలర్ వరలక్ష్మి లింబాద్రిగౌడ్ శుక్రవారం అందజేశారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శాల ప్రసాద్, యువకులు పాల్గొన్నారు.

గీతాభవన్‌లో సత్సంగం

నిజామాబాద్ సిటీ: ప్రబోధాత్మక సుమ గ్రంథం భగవద్గీత అని ప్రముఖ ధార్మికవేత్త బొడ్డు దయానంద్ అన్నారు. శుక్రవారం స్థానిక అఖిల భారతీయ భగవద్గీత కేంద్ర ప్రచార మండలిలో గీతా సత్సంగం జరిగింది. మానసికంగా, ఆరోగ్యపరంగా, ఆనందంగా ఉండడానికి పిల్లలు పెద్దలందరూ గీత శ్లోకాలను పఠించాలని ప్రవచన కర్త దయానంద్ వివరించారు. క్రోధి నామ సంవత్సరం అందరికి అనుకూలం కావడానికి ఈయేడు గోసేవ పూజలు, యజ్ఞ హోమాలు, ధార్మిక సేవ కార్యక్రమాలు చేపట్టాలని ఆధ్యాత్మికవేత్త, వేద పండితులు బ్రహ్మశ్రీ జనగామ చంద్రశేఖర శర్మ పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఎంఎస్ నృసింహాచారి, కార్యదర్శి మేడిదర్ల ప్రభాకర్ రావు, కోశాధికారి ఆరెట్టి లక్ష్మీనారాయణ, జీఎం శంకర్, సేర్ల దయానంద్, ఇంజినీర్ గంగాధర్, వెంకట స్వామి పాల్గొన్నారు.

తవ్వేస్తూ.. దోచేస్తూ..

- ముప్కాల్‌లో జోరుగా సాగుతున్న మొరం దందా
- పట్టాల పేరుతో గుట్టలు మాయం చేస్తున్న వ్యాపారులు
- పట్టించుకోని అధికారులు



రెంజర్లలో అక్రమంగా తరలిస్తున్న మొరం

బాల్కొండ: అనుమతులు లేకుండా అడ్డగోలుగా మొరం తవ్వకాల అక్రమ దందా ముప్కాల్ మండలంలో జోరుగా సాగుతోంది. పట్టాల పేరుతో గుట్టలను మాయం చేస్తున్నారు. జేసీబీలు ఉపయోగించి తవ్వకాలు చేపడుతూ అక్రమార్కులు రూ. లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా చూస్తున్న సంబంధిత అధికారులు నోరు మెదపడం లేదు. దీంతో వీరి వ్యాపారం మూడు టిప్పర్లు.. ఆరు ట్రాక్టర్లుగా సాగుతోంది.

ముప్కాల్ మండల పరిధిలో వరద కాలువ నుంచే కాకుండా గ్రామాల్లో కూడా మొరం దందా యథేచ్ఛగా సాగుతోంది. మామూళ్లకు అలవాటు పడ్డ అధికారులు వీరి వ్యాపారానికి అడ్డురాక పోవడంతో దీంతో వీరి వ్యాపారం జోరుగా సాగుతోంది. పట్టా భూముల్లో మొరం తవ్వకాలు చేపడుతున్నమంటు కమర్షియల్ దందాలకు తరలిస్తున్నారు. పట్టా భూమిలో తవ్వకాలు చేపట్టి కమర్షియల్ దందాలు చేయరాదనే నిబంధనలు ఉన్నా వాటిని తుంగలో తొక్కేస్తున్నారు. అంతే కాకుండా అనుమతికి సంబంధించి ప్రభుత్వానికి చెల్లించే ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇంతలా వీరి అక్రమ వ్యాపారం యథేచ్ఛగా సాగుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో మామూళ్ల ముట్టాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


ధరలకు రెక్కలు..

మొరం వ్యాపారులు కుమ్మక్కై వినియోగదారుల నడ్డి విరుస్తున్నారు. 4 కిలోమీటర్ల లోపు దూరం ఉన్న ట్రాక్టర్‌కు రూ. 1100 నుంచి రూ. 1200 వసూలు చేస్తున్నారు. టిప్పర్‌కు రూ. 2500 నుంచి రూ. 3 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇసుక ధరలకే ఇది వరకే రెక్కలు వచ్చి సామాన్యులు ఇళ్లు కట్టుకునే పరిస్థితి లేకుండా పోయింది. దీనికి తోడు మొరం అక్రమ దందా చేసే వారు సైతం సిండికేట్‌గా మారడంతో ఇక వీరు ఆడిందే ఆట పాడిందే పాటగా మారుతోంది. దీంతో సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ముప్కాల్ మండలం రెంజర్లలో గత వారం రోజుల నుంచి మొరం దందా జోరుగా సాగుతున్నా అధికారులు ఇప్పటికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అక్రమ మొరం చేపట్టే వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బీజేపీతోనే దేశాభివృద్ధి



మారంపల్లిలో కూలీలతో మాట్లాడుతున్న నాయకులు



బాల్కొండలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

డొంకేశ్వర్: కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంటేనే దేశాభివృద్ధి జరుగుతుందని బీజేపీ మండల అధ్యక్షులు పోతుగంటి సురేందర్ అన్నారు. శుక్రవారం మారంపల్లిలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నరేంద్ర మోదీ మహిళల కోసం రుణాలు, పేదలకు ఉపాధిహామీ, ఉచిత రేషన్ అందజేస్తున్నారని తెలిపారు. జిల్లాలో వంతెన నిర్మాణాలతో పాటు పసుపు బోర్డు ప్రకటన చేశారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కూలీలను కోరారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారంపల్లి గంగాధర్, బాబురావు, బాలరాజ్, రాజేందర్, సంతోష్, రాజన్న తదితరులు ఉన్నారు.

బాల్కొండలో..

బాల్కొండ: మండల కేంద్రంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌కు మద్దతుగా పార్టీ నాయకులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. ప్రచారంలో పార్టీ మండల అధ్యక్షుడు అంబటి నవీన్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముప్కాల్‌లో..

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని నిజామాబాద్ కార్పొరేటర్ స్రవంతిరెడ్డి అన్నారు. ముప్కాల్ మండల కేంద్రంలో మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బీజేపీపై కొందరు కుట్రపూరిత తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అర్వింద్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ముస్కు నర్సయ్య, పద్మ, మహిళలు పాల్గొన్నారు.



ముప్కాల్‌లో మాట్లాడుతున్న స్రవంతి రెడ్డి

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేద్దాం



వినయ్‌రెడ్డితో డొంకేశ్వర్ మండల నాయకులు



సుంకె శ్రీనివాస్‌కు కండువా వేస్తున్న వినయ్‌రెడ్డి

ఆర్మూర్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి విజయం కోసం కృషి చేద్దామని పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని తన నివాసంలో పలు పార్టీల నాయకులు శుక్రవారం ఆయన సమక్షంలో చేరారు. డొంకేశ్వర్ మండలం జీజీ నడ్కుడ గ్రామానికి చెందిన గైని రాజేశ్వర్, నందిపేటకు చెందిన ముప్పని గంగారాం, చిన్నయానంకు చెందిన పూజ భరత్‌కుమార్, కుర్మె పోతన్న, మరడి కుర్మె భోజన్న, గడ్డం చిన్నారెడ్డి, మేకల పెద్ద భోజన్న, పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి వినయ్‌రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్‌లో చేరిన జన జాగృతి సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు

ఆర్మూర్ పట్టణానికి చెందిన తెలంగాణ జన జాగృతి సమితి పార్టీ రాష్ట్ర వ్యవస్థాపకుడు సుంకె శ్రీనివాస్ కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాయిబాబా గౌడ్, రమేశ్, శ్రీనివాస్ రెడ్డి, ఫయిూం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీ నాయకుల చేరిక

మాక్లూర్: మండలంలోని చిన్నాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో శుక్రవారం చేరారు. చేరిన వారిలో బీఆర్ఎస్ చిన్నాపూర్ గ్రామ అధ్యక్షుడు గంగారెడ్డి, యూత్ అధ్యక్షుడు సుమన్, ఉపాధ్యక్షుడు అర్గుల్ సంతోష్, బీజేపీకి చెందిన సాయికుమార్ ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వీరు కాంగ్రెస్‌లో చేరగా వినయ్‌రెడ్డి వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వినయ్‌రెడ్డితో చిన్నాపూర్ నాయకులు

నేడు బైశాఖి పండుగ

నిజామాబాద్ సిటీ: నగరంలోని కంఠేశ్వర్ ఫతేగడ్ గురుద్వారాలో నేడు(శనివారం) సిక్కుల నూతన సంవత్సర పండుగ బైశాఖి జరుగనుందని సిక్కు ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కృపాల్ సింగ్ తెలిపారు. ఈ పండుగను ఖాల్సా పంత్ అని కూడా అంటారు. గురు గోవింద్ సింగ్ మహరాజ్ 1699 మార్చి 30న ఖాల్సాపంత్‌ను కేశ్ ఘర్ సాహెబ్ అమృత్‌సర్‌లో పాంచ్ ప్యారేలను తయారు చేసి, దేశ సమైక్యత కోసం కులమతాలకు తావులేకుండా దేశాన్ని ధర్మాన్ని రక్షించటానికి వివిధ మతాలకు చెందిన ఐదుగురికి అమృతం తాగించి పాంచ్ ప్యారేగా నామకరణం చేశారు. అనంతరం ప్రతి సిక్కు సోదరులను సింగ్(లయన్)గా ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం ఏప్రిల్‌లో బైశాఖి జరుపుకోవటం ఆనవాయితీగా వస్తోంది.

ట్రాఫిక్ మళ్లింపులు..

ఖలీల్ వాడి: సిక్కుల పండుగ బైశాఖి సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని సీపీ కల్మేశ్వర్ తెలిపారు. నేడు నగరంలోని పాములబస్తీ నుంచి సాయంత్రం 5 గంటలకు ఊరేగింపు ప్రారంభమై కంఠేశ్వర్ రైల్వే కమాన్, గురుద్వారా నుంచి గాజుల్‌పేట మీదుగా గురుద్వారా వరకు రాత్రి 10 గంటలకు చేరుకుంటుందన్నారు. ఈ ఊరేగింపు నగరంలోని ముఖ్య మార్గాలైన రైల్వే కమాన్, ఎన్టీఆర్ చౌరస్తా, రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్ స్టాండ్, గాంధీ చౌక్, పెద్దబజార్ లక్ష్మి మెడికల్ నుంచి గాజుల్ పేట్ గురుద్వారాకు చేరుకుంటుందన్నారు. నగర ప్రజలు ఇతర మార్గాల ద్వారా వెళ్లవలసిందిగా సీపీ కోరారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా పయనించాలని ఎన్‌సీడీ జిల్లా కో–ఆర్డినేటర్, జిల్లా ఆరోగ్య విద్యా బోధకుడు ఘన్పూర్ వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండాలన్నారు. మానసిక ఒత్తిడి కలిగినప్పుడు శారీరక వ్యాయామం, ఆటలు, మెడిటేషన్ చేస్తూ ప్రశాంతతను పొందాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వైస్ ప్రిన్సిపల్ భువనేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్‌బట్టు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పశువులకు సకాలంలో నీరందించాలి

మాక్లూర్: ఎండలు తీవ్రంగా ఉన్నందున పశువులకు సకాలంలో నీరందించాలని జిల్లా పశువైద్యాధికారి జగన్నాథచారి రైతులకు సూచించారు. మండలంలోని గుంజ్లి గ్రామంలో మండల పశువైద్యాధికారి కిరణ్‌దేశ్‌పాండే ఆధ్వర్యంలో జరుగుతున్న పశువుల గాలికుంటూ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి పశువుకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకా వేయించాలన్నారు. పశువులకు ప్రతి రోజూ నాలుగు సార్లు తాగునీరు అందించాలన్నారు. ఆయన వెంట సిబ్బంది వినీత, సుధీర్, జైల్‌సింగ్, శ్రీనివాస్, మహేశ్వరి, పుష్ప, లక్ష్మి, రైతులు ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జగన్నాథచారి

ధ్యానంతో ఒత్తిడి దూరం



సదస్సులో మాట్లాడుతున్న సులోచన

ఆర్మూర్‌టౌన్: ధ్యానంతో ఒత్తిడి దూరమవుతుందని జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ స్వామి సులోచన అన్నారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉన్న సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ఒత్తిడి నుంచి ఉపశమనం అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనవుతున్నారని ఆ ఒత్తిడిని ఎలా అధిగమించాలో వివరించారు. కార్యక్రమంలో మానసిక వైద్యుడు రవితేజ, ఎంపీహెచ్‌ఏ అనురాధ, కళాశాల ప్రిన్సిపాల్ ధనవేణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు



పెర్కిట్: ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామ కమిటీ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీడీసీ అధ్యక్షుడిగా మేడిపల్లి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా కె నడిపి నర్సారెడ్డి, కోశాధికారిగా సురేశ్ రత్మాజీ, ప్రధాన కార్యదర్శిగా కంపదండి వినోద్, ముఖ్య సలహాదారులుగా బొబ్బిల బొర్రన్న ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధి పనులకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

వేల్పూర్‌లో..

వేల్పూర్: మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గజ్జెల గంగాధర్, కార్యదర్శిగా మండాజి దయాకర్, కోశాధికారిగా జమలగిరి రాజేందర్, సలహాదారులుగా గజ్జల రాజు, అమృతల నరసింహచారి, వేల్పుల ప్రసాద్, సాగర్, విఠల్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

నిజామాబాద్ సిటీ: అర్సపల్లి రైల్వేగేట్ వద్ద ఇటీవల ఓ హనుమాన్‌మాల భక్తుడిపై జరిగిన దాడిని నిరసిస్తూ ఇందూరు గురుస్వామి దేశాయి గంగాధర్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక హనుమాన్ జంక్షన్(వినాయక్‌నగర్)లో ధర్నా నిర్వహించారు. హనుమాన్‌మాల ధరించిన అంగీర్ల నరేశ్‌పై అకారణంగా దాడి చేసిన వ్యక్తులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో హనుమాన్ మాలధారణ స్వాములు సోమ శ్రీశైలం, సతీష్, సృజన్, భాస్కర్, ఠాకూర్, శంకర్, గోపి, భక్తులు పాల్గొన్నారు.

సమాచారం..

▪ నేడు చాయ్‌పే చర్చ

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో ఉన్న రాజస్థాన్ హోటల్‌లో చాయ్ పే చర్చ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్లు బీజేపీ నాయకులు శుక్రవారం తెలిపారు. కార్యక్రమానికి ఎంపీ అర్వింద్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

▪ విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆర్మూర్‌టౌన్: పట్టణ కేంద్రంలోని అన్ని ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి 10 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ హరిచంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర మరమ్మతుల పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

అరుణోదయ కానూరికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

బోధన్: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకుడు కానూరి వెంకటేశ్వర్‌రావు వర్ధంతిని పట్టణ కేంద్రంలో సంస్థ ప్రతినిధులు శుక్రవారం నిర్వహించారు. కానూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమాఖ్య జిల్లా ప్రతినిధి పోశెట్టి మాట్లాడుతూ.. ప్రజా కళలకు జీవం పోసిన కానూరి జీవితం నేటి తరం కళాకారులు, ప్రజా ఉద్యమ కారులకు ఆదర్శమని పేర్కొన్నారు. నాయకులు అశోక్, సాయిలు, శ్రీనివాస్, లక్ష్మణ్, అన్వర్ పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 -	మైదాన్ (హిందీ)- 10.00, 10.25, లవ్‌గురు (తెలుగు)-01.50 శ్రీరంగనీతులు -7.40 గాడ్జిల్లా ఎక్స్ కాంగ్(3డీ–తెలుగు)-5.00
స్క్రీన్-2 -	టిల్లు స్క్వేర్ (తెలుగు) - 10.00, 4.25, 10.50 ది ఫ్యామిలీ స్టార్ -01.00, 7.25
స్క్రీన్-3 -	బడేమియా చోటే మియా (తెలుగు)- 11.50, 6.30, గీతాంజలి మళ్లీ వచ్చింది - 3.25, 10.05
స్క్రీన్-4 -	గీతాంజలి మళ్లీ వచ్చింది - 10.15 మంజుమ్మల్ బాయ్స్ (తెలుగు)- 1.20, 10.35 లవ్‌గురు-04.15, 7.25

నిరుద్యోగులకు ఉచిత మధ్యాహ్న భోజనం

నిజామాబాద్‌అర్బన్: ఇందూర్ నగరం ఖలీల్‌వాడిలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న పేద విద్యార్థులకు ధన్‌పాల్ లక్ష్మీబాయ్– విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా దాదాపు రెండు వందల మందికి ఉచిత మధ్యాహ్న భోజనం సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నిరుద్యోగులకు మొండి చేయి చూపెట్టిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లుగా ఉద్యోగ అవకాశాలు సకాలంలో కల్పించాలని, నిరుద్యోగ భృతి రూ.4 వేలు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నిరుద్యోగుల తరుపున ఉద్యమం చేపడతామని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు తన ట్రస్ట్ ద్వారా సేవలందించడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. బీజేపీ ప్రభుత్వం యువతకు వెన్నుదన్నుగా ఉంటుందన్నారు. గ్రంథాలయంలో కూలర్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే విన్నవించగా.. వెంటనే ధన్‌పాల్ స్పందించి కూలర్లు ఏర్పాటు చేయాలని గ్రంథాలయ అధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మీనారాయణ, కార్పొరేటర్ ఇల్లేందుల మమత, తదితరులు పాల్గొన్నారు.



బడా రామ మందిరంలో ప్రవచనాలు

నిజామాబాద్ సిటీ: శ్రీ రామ నవమి సందర్భంగా నగరంలోని పెద్ద రామ మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం ప్రముఖ ప్రవచనకర్త, జోతిష్యులు శశికాంత్ జోషి వాల్మీకి రామాయణాన్ని, సీతారాముల కల్యాణోత్సవం ఘట్టాన్ని భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామాయణాన్ని ప్రతి ఒక్కరూ తమ జీవితానికి అన్వయించుకోవాలని, ధర్మబద్ధంగా జీవించాలని అన్నారు. బడా రాంమందిర్ పీఠాధిపతి సీతారామచంద్రమూర్తి, స్థానికులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

నవీపేట: మండలంలోని జన్నెపల్లి గ్రామంలో మక్కల సాయిలు(45) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ శుక్రవారం రాత్రి తెలిపారు. వివరాలు.. మక్కల సాయిలు మద్యం తాగి నిత్యం భార్య రేఖతో గొడవ పడేవాడు. శుక్రవారం ఉదయం సాయిలు మృతి చెందాడు. క్షణికావేశంలో భార్య రేఖనే గొంతు నులిమి చంపేసిందని మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.